నేడు బోథ్‌కు రేవంత్

బోథ్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం బోథ్‌కు రానున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే విజయభేరి సభకు హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఎన్నికల ప్రక్రియలో వీరే కీలకం..

శాసనసభ ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వో మొదలు జిల్లా ఎన్నికల అధికారి వరకు అంతా కీలకమే.

10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/17.0

ఆకాశం పలుచోట్ల మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఖైదీలు న్యాయసాయం పొందవచ్చు



కౌన్సిల్ సభ్యులతో కలిసి జిల్లా జైలును సందర్శిస్తున్న క్షమాదేశ్‌పాండే

ఆదిలాబాద్‌టౌన్: ఖైదీలు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సిస్టమ్ కౌన్సిల్ ద్వారా ఉచిత న్యాయ సాయం పొందవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. జిల్లా కేంద్రంలోని జైలును లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఖైదీలు ఏదైనా కేసులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు వారి ఆర్థిక స్థితి, అక్షరాస్యత ఆధారంగా వివక్ష చూపకూడదని పేర్కొన్నారు. కొన్ని కఠినమైన షరతులను సడలించడానికి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సిస్టమ్ పని చేస్తుందన్నారు. ప్రతిఖైదీ న్యాయ సేవలు పొం దేందుకు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు అశోక్, ఉమేష్‌రావు, జైలు సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, జైలర్లు మధు, కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్ నాయకత్వం దేశానికి అవసరం'



మాట్లాడుతున్న శంకర్ దోడ్గే

ఆదిలాబాద్‌టౌన్: సీఎం కేసీఆర్ వంటి సమర్థవంత నాయకుడు దేశానికి అవసరమని మహారాష్ట్ర బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి, నాందేడ్ మాజీ ఎమ్మెల్యే శంకర్ దోడ్గే అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలోనే తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు పాలించిన మహారాష్ట్ర పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ వంటి సమర్థవంతమైన నాయకుడిని పాలనలో తెలంగాణ అభివృద్ధి సాధించిందని చెప్పారు. దేశంలో ఎక్కడలేని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, పార్టీ నాయకులు సతీశ్, కస్తాల ప్రేమల, యూనుస్ అక్బాని, సుకన్య, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

'పది'పై శ్రద్ధ వహించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

జైనథ్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో ప్రణీత అన్నారు. మండలంలోని పిప్పర్‌వాడ జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయడంతో పాటు రివిజన్ చేపట్టాలన్నారు. ఆమె వెంట ఉపాధ్యాయులు తదితరులున్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం..

తాంసి: విద్యార్థుల హాజరుశాతం పెంచేలా ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని డీఈవో ప్రణీత అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో మంగళవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరై మాట్లాడారు. వారివెంట ఇన్‌చార్జ్ ఎంఈవో శ్రీకాంత్, కప్పర్ల హెచ్ఎం రాజన్న తదితరులున్నారు.

17 నుంచి ఎన్నికల వ్యయ ఖాతాల పరిశీలన

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థుల ఖర్చుల వివరాలకు సంబంధించిన వ్యయ ఖాతాల పరిశీలన తేదీలను ఖరారు చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 17న మొదటి విడత, 21న రెండో విడత, 25న మూడో విడత పరిశీలన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశంలో చేపట్టనున్నారు. అలాగే బోథ్ నియోజకవర్గానికి సంబంధించిన వ్యయ పరిశీలన ఈ నెల 18, 22, 26వ తేదీల్లో బోథ్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో చేపట్టనున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు స్వయంగా లేదా వారి ఏజెంట్ల ద్వారా అకౌంట్ల పుస్తకాలను నిర్ణీత తేదీల్లో ఉదయం 10గంటల నుంచి ఎన్నికల వ్యయ పరిశీలకుల ద్వారా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రకటనలో సూచించారు.

జిల్లా ఓటర్లు.. 4,48,374



- కొత్తగా పెరిగింది.. 5,936 మంది
- తుది జాబితా ప్రకటించిన ఈసీ
- యువ ఓటర్లే అధికం

జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలో ఈ ఏడాది అక్టోబర్ 4, ఈ నెల 10న ప్రకటించిన జాబితా ప్రకారం వయస్సుల వారీగా ఓటర్ల వివరాలు...

వయస్సు	ఆదిలాబాద్		బోథ్	
	అక్టోబర్4న	ఈనెల10న	అక్టోబర్4న	ఈనెల10న
18–19	7,293	8,103	7,328	7,684
20–29	52,928	54,899	48,978	49,716
30–39	64,637	65,516	62,120	62,283
40–49	46,579	47,069	36,665	36,718
50–59	33,147	33,442	26,129	26,169
60–69	18,923	19,032	15,928	15,934
70–79	9,870	9,907	7,226	7,226
80 ఆపైన	2,371	2,358	2,316	2,318

నియోజకవర్గం	ఓటర్లు
ఆదిలాబాద్	2,40,326
బోథ్	2,08,048



కైలాస్‌నగర్: ప్రజాస్వామ్యానికి ఓటు పునాది వంటిది. దాన్ని వినియోగించుకోవడం ద్వారా మంచి నేతలను ఎన్నుకుని సుపరిపాలనకు బాటలు వేసుకునే అవకాశముంటుంది. అలాంటి వజ్రాయుధాన్ని అర్హులైన ఏ ఒక్కరూ కోల్పోకుండా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు నామినేషన్ల స్వీకరణ వరకు అవకాశం కల్పించింది. ఈ నెల 10న ఓటర్ల తుది జాబితాను ఈసీ ప్రకటించింది. ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల పరిధిలో 4,48,374 మంది ఓటర్లున్నట్లుగా లెక్క తేల్చింది. ఇటీవల ప్రకటించిన జాబితాతో పోల్చితే తాజాగా 5,936 మంది కొత్తగా నమోదయ్యారు. వీరంతా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అయితే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటముల ఖరారులో యువ ఓటర్లే కీలకం కానున్నారు. జిల్లాలో వారి సంఖ్యే ఎక్కువగా ఉండటం గమనార్హం.

పెరిగిన ఓటర్లు 5,936

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితా ప్రకటించింది. దీని ప్రకారం రెండు నియోజకవర్గాల పరిధిలో 4,42,438 ఓటర్లున్నట్లుగా లెక్క తేల్చింది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 2,35,748 మంది ఉండగా, బోథ్ నియోజకవర్గంలో 2,06,690 మంది ఉన్నారు. అదే నెల 9న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన ఈసీ అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించువాలనే ఉద్దేశంతో ఓటరు నమోదుకు మరో అవకాశాన్ని కల్పించింది. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని సూచించింది. అక్టోబర్ 9 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు విధించింది. ఈసీ కల్పించిన అవకాశాన్ని అందిపుచ్చుకుని జిల్లాలో 5,936 మంది కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఆదిలాబాద్ నియోజకవర్గంలో 4,578 మంది, బోథ్ నియోజకవర్గంలో 1358 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను పరిశీలించిన రెవెన్యూ అధికారులు వాటిని పరిశీలించి నిబంధనల మేరకు ఓటు హక్కు కల్పించారు. దీంతో 21రోజుల వ్యవధిలో ఐదు వేలకు పైగా ఓటర్లు కొత్తగా పెరిగారు. వీరంతా ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించనున్నారు.

డిజిటల్ దిశగా..

- సర్కారు బడుల్లో మరోసారి కంప్యూటర్ విద్య
- జిల్లాలో 60 పాఠశాలల్లో అమలుకు చర్యలు
- విద్యార్థులకు దక్కనున్న ప్రయోజనం



కంప్యూటర్‌విద్య నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడులను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కంప్యూటర్ విద్యకు మరోసారి శ్రీకారం చుట్టింది. గతంలో అమలులో ఉన్నప్పటికీ అనుకున్న స్థాయిలో విద్యార్థులకు ప్రయోజనం చేకూరలేదు. నిర్వహణ బాధ్యతలు చూసిన సంస్థ గడువు ముగియడం, కంప్యూటర్లు మూలన పడడంతో అటకెక్కింది. కంప్యూటర్ విద్య పరంగా పీజీఐడీ (పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇన్‌డెక్స్ ఫర్ డిస్ట్రిక్ట్) సర్వే చేయగా సాంకేతిక విద్య పరంగా వెనుకబడి ఉందని నిర్ధారించింది. ఈ క్రమంలో విద్యాశాఖ మరోసారి డిజిటల్ దిశగా దృష్టి సారించింది. 2022–23 విద్యా సంవత్సరంలో భాగంగా జిల్లాలో సమగ్ర శిక్ష ద్వారా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతోంది. మన ఊరు– మనబడి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపికైన పాఠశాలలకు డిజిటల్ చదువులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. గతంలో జిల్లాలో 54 పాఠశాలల్లో కంప్యూటర్ విద్య అమలులో ఉండగా, ఈ విద్యా సంవత్సరం నుంచి 60 పాఠశాలల్లో అమలుకు శ్రీకారం చుట్టనున్నారు.

60 పాఠశాలలకు కంప్యూటర్లు..

జిల్లాలో 60 పాఠశాలల్లో కంప్యూటర్ విద్య బోధించేందుకు రాష్ట్ర విద్యా శాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో 12 కేజీబీవీలు, 2 మోడల్ స్కూళ్లు, ఒక స్పోర్ట్స్ స్కూల్, 3 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, 42 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఆదిలాబాద్‌రూరల్ మండల పరిధిలో 3, ఆదిలాబాద్‌అర్బన్ మండలంలో 8, బజార్‌హత్నూర్‌లో 2, బేలలో 4, భీంపూర్‌లో 2, బోథ్‌లో 5, గుడిహత్నూర్‌లో 4, ఇచ్చోడలో 4, ఇంద్రవెల్లి మండలంలో 1, జైనథ్‌లో 9, మావలలో 1, నార్నూర్‌లో 2, నేరడిగొండ 3, సిరికొండ 1, తలమడుగు 5, తాంసిలో 2, ఉట్నూర్‌లో 5 పాఠశాలలను ఎంపిక చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలకు కంప్యూటర్లు సమకూర్చనున్నారు. ఈ ప్రకారం ప్రభుత్వ డైట్ కళాశాలకు 10, అలాగే 13 పాత మండలాల ఎమ్మార్సీలకు 6 కంప్యూటర్ల చొప్పున కేటాయించనున్నారు.

విద్యార్థులకు ప్రయోజనం..

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఇక సాంకేతిక పరిజ్ఞానం అందనుంది. రెండు సంస్థలు వీటి నిర్వహణ బాధ్యతలు చూడనున్నాయి. మైక్రోకేర్ కంప్యూటర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైట్ కళాశాల, ఎమ్మార్సీల కంప్యూటర్ల బాధ్యతలు చూడనుండగా, పీఎస్ఎస్ఆర్‌ఐటీ సర్వీస్ సంస్థ పాఠశాలల కంప్యూటర్ల నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. మూడేళ్ల పాటు నిర్వహణ చేపట్టనున్నాయి. కంప్యూటర్లతో పాటు పాఠశాలలకు యూపీఎస్, డెస్క్‌టాప్, ప్రింటర్లను సమకూర్చనున్నాయి.

ఈసారైనా కంప్యూటర్ విద్య అందేనా..

దివంగత సీఎం రాజశేఖరరెడ్డి సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో అప్పట్లో కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టారు. ఆయన మరణానంతరం ఈ విద్య కుంటుపడింది. సర్కారు బడుల్లో కంప్యూటర్లు ఉన్నప్పటికీ మరమ్మతులకు గురవడం, నిర్వహణ బాధ్యతలు చేపట్టిన సంస్థ గడువు ముగియడంతో మూలనపడింది. ముఖ్యంగా ఇన్‌స్ట్రక్టర్లు లేకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. ఈసారి ప్రభుత్వం కంప్యూటర్ పరిజ్ఞానం అందించేందుకు చర్యలు తీసుకోగా, ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయం. త్వరలో ఏమైన ఆదేశాలు జారీ అవుతాయా అనేది వేచిచూడాల్సిందే.

పకడ్బందీగా అమలు చేస్తాం..

సమగ్ర శిక్ష పథకం కింద జిల్లాలో 60 పాఠశాలలు కంప్యూటర్ విద్యకు ఎంపికయ్యాయి. ఈ పాఠశాలలకు త్వరలోనే కంప్యూటర్లు చేరనున్నాయి. వీటితో పాటు ఎమ్మార్సీలు, డైట్ కళాశాలలో కూడా ప్రభుత్వం కంప్యూటర్లను ఏర్పాటు చేయనుంది. దీంతో సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు మేలు చేకూరనుంది. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపడతాం.

– జి.నారాయణ, విద్యా శాఖ సెక్టోరియల్ అధికారి, ఆదిలాబాద్

చెక్‌పోస్ట్‌ల వద్ద నిరంతర తనిఖీలు

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ

జైనథ్: అంతర్రాష్ట్రీయ, అంతర్ జిల్లా చెక్‌పోస్ట్‌ల వద్ద 24 గంటల పాటు పకడ్బందీ తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. డబ్బు, మద్యం, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా చెక్‌పోస్ట్‌ల వద్ద ఇప్పటి వరకు రూ.1.35కోట్ల నగదు, 71 కిలోల గంజాయి, 12.08 లక్షల విలువ చేసే 1826. 9 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం 796 కేసుల్లో 1292మంది బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఆయన వెంట జైనథ్ సీఐ నరేశ్ కుమార్, ఎస్సై పురుషోత్తం, తదితరులున్నారు.

ప్రలోభాలకు లోనుకాకుండా ఓటేయాలి



ఓటు ప్రాధాన్యతపై ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా విద్యార్థులు తల్లిదండ్రులకు తెలిజేయాలని కలెక్టర్ రాహుల్ సూచించారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో స్వీప్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులని, ఉన్నత ఆశయాలతో ఎదగాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా తల్లిదండ్రులు, బంధువులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులు, అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. స్వీప్ కార్యక్రమాలపై ప్రదర్శనలిచ్చి ఆకట్టుకున్న పలువురు విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. అనంతరం ఓటు వినియోగ బాధ్యతను తెలిపేలా చేపట్టిన సంతకాల సేకరణ, సెల్ఫీ పాయింట్ కార్యక్రమాల్లో కలెక్టర్, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతోతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖల అధికారులు మిల్కా, రమేశ్‌రాథోడ్, డీఈవో ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

19న జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్, నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 19న నేరడిగొండ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్–14, 17 బాలబాలికల జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్, నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ సొంత గ్లౌ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎంపిక పోటీలకు ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున క్రీడాకారులు హాజరయ్యేలా వ్యాయామ ఉపాధ్యాయులు చూడాలని కోరారు. అర్హత కలిగిన క్రీడాకారులు సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11గంటలకు పోటీల ఆర్గనైజర్ ఎన్.స్వామి, కవితకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

సమర్థవంతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న జీబీ పాటిల్, పక్కన కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి, తదితరులు

- జిల్లా ఎన్నికల పరిశీలకులు జీబీ పాటిల్
- ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష

కైలాస్‌నగర్: జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఎన్నికల బృందాలు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు జీబీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ పరిశీలకులు అశోక్ గోయల్‌తో కలిసి ఎన్నికల నిర్వహణపై పీవో, ఏపీవోలు, అధికా రులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఏమైనా సమస్యలు ఎదురైతే తెలుపాలన్నారు. పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఓటరు స్లిప్పులను ఓటర్లందరికీ పంపిణీ జరిగేలా చూడాలన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే ప్రతీ ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 24/7 పర్యవేక్షించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు సరిహద్దు చెక్‌పోస్టుల్లో ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో పూర్తి నిఘాతో నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రతీ ఓటరు ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించాల్సిన స్టేషనరీ, ఎన్నికల సామగ్రి, క్రమపద్ధతిలో పంపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా కేంద్రాల్లో అన్ని వసతులు పరిశీలించుకోవాలని మహిళలు, దివ్యాంగులు, యువత కోసం మోడల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సెక్టార్, అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారులు, బీఎల్‌వోల సమన్వయంతో వందశాతం ఓటరు స్లిప్పులు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు బృందాలు అప్రమత్తతో విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో,నోడల్‌అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి

- వీసీలో రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్

కైలాస్‌నగర్: ఓటరు స్లిప్పుల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వెబ్ కాస్టింగ్ నిర్వహణ, ఓటరు స్లిప్పుల పంపిణీపై జిల్లా ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అవసరమైన యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన స్థానిక యువతను వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు స్లిప్పుల ముద్రణ చేసి పంపిణీ చేయాలన్నారు. పర్యవేక్షణకు గాను నోడల్ అధికారిని నియమించాలన్నారు. ఈ విషయంలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ షెడ్యూల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందస్తుగా తెలియజేయాలన్నారు. ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్యంపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి

- ఆర్ఎం సోలోమన్



ఆర్ఎం సోలోమన్‌ను పరీక్షిస్తున్న వైద్యురాలు

ఆదిలాబాద్: ఉద్యోగుల ఆరోగ్యంపై ఆర్టీసీ ప్రత్యేకదృష్టి సారిస్తోందని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో వరల్డ్ డయాబెటిక్ డే పురస్కరించుకొని ఉద్యోగులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు ఒత్తిడికి లోనుకాకుండా, జీవనశైలిని మెరుగుపరచుకుంటే డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు ప్రణీత్, ప్రవీణ్, డీఎం కల్పన, మెడికల్ ఆఫీసర్ భూమన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటు వేయం..



మాట్లాడుతున్న నాయకులు

కడెం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓటు వేయమని మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికులు తీర్మానించారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కరించనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం మోనును సవరించి, బ్రేక్‌ఫాస్ట్‌కు అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కడెం, దస్తురాబాద్ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు లత, శంకరమ్మ, కార్మికులు కౌసల్య, లింగవ్వ, రజిత ఉన్నారు.

'రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదు'

ఆదిలాబాద్‌టౌన్: ఎవరైనా ఇతరులను కించపర్చే విధంగా, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు ధర్మావర్ రాకేష్‌పై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జోగు రామన్నపై సోషల్ మీడియా ద్వారా ఫొటోలు మార్ఫింగ్ చేసి కించపర్చే విధంగా పోస్టులు పెట్టాడని వాగ్మారే ప్రశాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మద్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం బాటిళ్లను మంగళవారం పట్టుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ సిబ్బందితో కలిసి మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా జానకిరామ్ బెల్ట్‌షాపు నిర్వహణకై రూ.2,500 విలువ చేసే 20మద్యం లిక్కర్ బాటిల్స్ తలిస్తుండగా పట్టుబడ్డాడు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అతడిపై మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నగదు స్వాధీనం

భైంసాటౌన్: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఎల్.శ్రీను తెలిపారు. పట్టణంలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టగా, బిద్రెల్లికి చెందిన భూమన్న అనే వ్యక్తి వాహనంలో ఆధారాలు లేకుండా నగదు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నేడు బీఆర్ఎస్‌లోకి అశోక్

తాంసి: కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇచ్చి నిరాకరించిన కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి వన్నెల అశోక్ నేడు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఇప్పటికే ఎన్నికల బరిలో భాగంగా నామినేషన్ దాఖలు చేసిన అశోక్ బీఆర్ఎస్ పార్టీలో నేడు చేరనుండడంతో నియోజకవర్గంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించనున్న సమావేశంలో పెద్ద ఎత్తున అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు సమాచారం.

ఎన్నికల ప్రక్రియలో వీరే కీలకం..



- బీఎల్‌వో నుంచి జిల్లా ఎన్నికల అధికారి వరకు
- ఓటరు జాబితా తయారీ మొదలు ఫలితాల వరకు

జంగ్ తెలంగాణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వో నుంచి మొదలు జిల్లా ఎన్నిల అధికారి వరకు అంతా కీలకం. ఓటరు జాబితా మొదలు ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఈ అధికార యంత్రాంగం శ్రమ అంతాఇంతా కాదు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో మొత్తం ఈ అధికారులపాత్రే ఉంటుంది.

జిల్లా ఎన్నికల అధికారి..

జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులకు విధుల కేటాయింపు మొదలుకుని సిబ్బందికి శిక్షణ, ఎన్నికల కార్యక్రమాల పూర్తిస్థాయి పర్యవేక్షణ, నిత్యం సమీక్ష జరుపుతూ మార్గదర్శనం చేస్తారు. అంతేకాదు ఎన్నికల విధులు బాధ్యాతాయుతంగా, ప్రశాంత వాతావరణంలో సాగేలా పర్యవేక్షిస్తారు. మొత్తంగా ఓటరు జాబితా తయారీ నుంచి మొదలు ఓట్ల లెక్కింపు వరకు జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్‌దే పూర్తి బాధ్యత.

బీఎల్‌వోలు..

గ్రామ, పట్టణ స్థాయిల్లో పనిచేసే వారు బీఎల్‌వో (బూత్ స్థాయి అధికారి)లు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటరు జాబితాలో పేరు నమోదు, తప్పులు, సవరణ, మార్పులు, చేర్పులు, తొలగింపులు.. ఇలా అన్ని బాధ్యతలు బీఎల్‌వోలు నిర్వర్తిస్తారు. ఓటరు జాబితా తయారీలో అధికారుల సహాయంతో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవకతవకలు లేని ఓటరు జాబితా తయారీలో కీలకంగా వ్యవహరిస్తారు.

ప్రిసైడింగ్ అధికారి..

ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి (పీవో) ఉంటారు. పోలింగ్ ప్రక్రియకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రి సమక్యూ బాధ్యత పీవోకు ఉంటుంది. ఆ కేంద్రం పూర్తి బాధ్యత ప్రిసైడింగ్ అధికారిదే. ఓటింగ్ ముగిసిన తర్వాత కూడా యంత్రాలను బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంలకు తరలించే వరకు పర్యవేక్షిస్తారు. వీరికి అదనపు ప్రిసైడింగ్ అధికారి సహాయంగా ఉంటారు. వీరితో పాటు మరో ముగ్గురు పోలింగ్ అధికారులు కూడా ఉంటారు. వీరంతా ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరును చూడాల్సిన బాధ్యత వీరిదే.

రిటర్నింగ్ అధికారి..

ప్రతీ నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి(ఆర్‌వో) ఉంటారు. ఎన్నికల సంఘం వీరిని నియమిస్తుంది. వీరు ఆ నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు. నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ మొదలు నామినేషన్ పరిశీలన, తిరస్కరణ, అభ్యంతరాలు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన అంతా వీరి చేతుల్లో ఉంటుంది. ఇక ఎన్నికల సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు అంతా వీరు చూస్తారు.

సెక్టోరియల్ అధికారి..

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించడంలో సెక్టోరియల్ అధికారి పాత్ర ఉంటుంది. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేయడం, విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనలో ముఖ్యపాత్ర పోషిస్తారు. ఒక్కో సెక్టోరియల్ అధికారికి ఆరు పోలింగ్ కేంద్రాలు కేటాయిస్తారు. పోలింగ్ కేంద్రంతో పాటు పోలింగ్ జరిగే పరిసరాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూస్తారు. పోలింగ్ సమయాల్లో ఆయన పర్యవేక్షించే పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా సెక్టోరియల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఉద్యమ సమయం నుంచి..

ఇచ్చోడ: ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నాయకుడిగా ఇచ్చోడతో కేసీఆర్‌కు 20ఏళ్ల అనుబంధం ఉంది. తెలంగాణ ఉద్యమ ప్రారంభంలో మొదటిసారిగా ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ 2003లో ఇచ్చోడకు వచ్చాడు. 2003 అక్టోబర్ 13వ తేదీన ఇచ్చోడ మండల కేంద్రంలోని తెలుగుదేశం భవనంపై నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవశ్యకతపై ప్రసగించారు. అప్పుడే బోథ్ నియోజకవర్గంలో టీఆర్ఎస్ బీజం వేసింది. అప్పటి వరకు నియోజకవర్గంలో కంచుకోటగా ఉన్న తెలుగుదేశం పార్టీని 2004లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందారు. తర్వాత 2014 ఎన్నికల బహిరంగ సభలో, 2018 ఎన్నికల బహిరంగ సభలో కేసీఆర్ ఇచ్చోడలో ఏర్పాటు చేసిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్నారు. 2023 ఎన్నికల సందర్భంగా ఈ నెల 16న కేసీఆర్ మరోసారి ఇచ్చోడకు రానున్నారు. దీంతో కేసీఆర్ ఇచ్చోడకు రావడం ఇది నాల్గోసారి.



2003 బహిరంగ సభలో మాట్లాడుతున్న కేసీఆర్(ఫైల్)

ఆరోపణలు రుజువు చేయకుంటే అడ్డుకుంటాం

- మహిళ అని కూడా చూడకుండా విమర్శలా
- కంది శ్రీనివాసరెడ్డిపై గండ్రత్ సుజాత ధ్వజం

ఆదిలాబాద్‌టౌన్: ఓ రాజకీయ పార్టీ నుంచి తాను కోట్ల రూపాయలు తీసుకున్నానని కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి చేసిన ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకురాలు గండ్రత్ సుజాత ఖండించారు. జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి సీఆర్ఆర్ నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేల మండలంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో తనతోపాటు సాజిద్‌ఖాన్, స్వతంత్ర అభ్యర్థి సంజీవ్‌రెడ్డి డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. ఆరోపణలను రుజువు చేయకుంటే లేకుంటే అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. తనపై అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాలో ఓ కన్సల్టెన్సిని నిర్వహిస్తూ అక్కడి ఉద్యోగులను మోసం చేసి డబ్బులు దండుకున్న కంది శ్రీనివాసరెడ్డిని అక్కడి ప్రభుత్వం వెల్లగొడితే జిల్లాకు వచ్చాడని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఎజిటెక్ ఫార్మా, భుక్తాపూర్‌లో నైసిటి టెక్నాలజి కంపెనీల పేరిట డబ్బులు దండుకుంటున్నారని పేర్కొన్నారు. తమ ఆస్తులు అమ్ముకొని ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీని రక్షించామని, కాంగ్రెస్ అధిష్టానం మూడు నెలల క్రితం వచ్చిన వ్యక్తి నుంచి డబ్బులు తీసుకొని టిక్కెట్ ఇవ్వడం జరిగిందని ఆరోపించారు. ఓటమి భయంతో తమపై విమర్శలు చేస్తున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశం అనంతరం కంది శ్రీనివాసరెడ్డిపై జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొనడం జరిగిందని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి సంజీవ్ రెడ్డి, మాజీ నాయకులు సాజిద్ ఖాన్, కౌన్సిలర్లు అంబకంటి అశోక్, ముబారక్, సంజయ్ పాల్గొన్నారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న సుజాత

కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డిపై కేసు

- ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్

మహిళలను కించపర్చే విధంగా మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ తెలిపారు. ఈ నెల 12న బేల మండలంలోని చెప్రాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా గండ్రత్ సుజాతను అసభ్య పదజాలంతో దూషించడంతో ఆమె బేల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపాడు. ఎవరైనా మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి వారి పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన దండారీ ఉత్సవాలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా ఆదివాసీ గ్రామాల్లో దీపావళి పండుగను పురస్కరించుకుని వారం రోజులుగా నిర్వహించిన దండారీ ఉత్సవాలు కోలబోడి పూజలతో ముగిశాయి. మంగళవారం మండల కేంద్రంలోని గోండ్‌గూడ, పొల్లుగూడ, గట్టెపల్లి, సమాక తదితర గ్రామాల్లో గుస్సాడీలు, దండారీ బృందం సభ్యులు తమతమ గ్రామాల్లో సంప్రదాయ వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలు చేస్తూ హారతి సేకరించారు. అనంతరం గ్రామ పొలిమెరలోని భీమల్ దేవ్‌చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేసి దండారీ ఉత్సవాలు ముగించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ఆదివాసీ పెద్దలున్నారు.



తిలకం దిద్దుతున్న మహిళలు

ప్రశ్నించిన వారిపై బీఆర్ఎస్ శ్రేణుల దాడి

లోకేశ్వరం: తొమ్మిదేళ్ల పాలనలో వట్టోలి గ్రామంలో అభివృద్ధి పనులు ఏం చేశారని, అభివృద్ధి ఎంత మేరకు జరిగిందో చూపాలని యువకులు ప్రశ్నించడంతో బీఆర్ఎస్ శ్రేణులు వారిపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని వట్టోలిలో చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మంగళవారం సాయంత్రం వట్టోలి గ్రామంలో పాల్గొనగా గ్రామంలో కనీసం రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదని యువత, బీజేపీ కార్యకర్తలు నిలదీశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ శ్రేణులు ఆ యువకులపై దాడి చేసి సమావేశం స్థలం నుంచి దూరంగా లాక్కెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రసంగించి వెళ్లిపోయారు.



గొడవకు దిగిన బీఆర్ఎస్-బీజేపీ కార్యకర్తలు

పోలీసులపై దాడి కేసులో నిందితులకు జైలు

లక్ష్మణచాంద: పోలీసులపై దాడి కేసులో ఇద్దరు నిందితులకు మూడు నెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు జిల్లా కోర్టుల సమన్వయ అధికారి సక్రియా నాయక్ ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. లక్ష్మణచాంద గ్రామంలోని వైన్‌షాప్ వద్ద 2016 ఏప్రిల్ 14న ఇదే గ్రామానికి చెందిన పత్తిపాక గంగన్న, ఎద్దండి ముత్తన్న మద్యం కొనుగోలు చేశారు. మద్యం విక్రయించిన దిలీప్‌తో వాగ్వాదానికి దిగగా.. అతడు పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో అప్పటి హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్ గౌడ్, కానిస్టేబుల్ గంగయ్య అక్కడికి వెళ్లి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నిందితులు పోలీసులపై దాడి చేసి దూషించారు. పోలీసుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై మహేందర్ కేసు నమోదు చేశారు. ఏపీపీఓ జి.రామకృష్ణ తొమ్మిది మందిని సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతో న్యాయమూర్తి నిందితులు గంగన్న, ముత్తన్నలకు మూడు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

19న ఖానాపూర్‌కు ప్రియాంకాగాంధీ

ఖానాపూర్: ఈ నెల 19న ఖానాపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ బహిరంగ సభస్థలిని మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జును గెలిపించడంలో భాగంగా ప్రచారానికి రానున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్య తెలిపారు. స్థానిక జేకే ఫంక్షన్ పరిసరాల్లోని స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్, మాజీ మార్కెట్ చైర్మన్ గంగనర్సయ్య, నాయకులు జహీర్ హైమద్, మడిగెల గంగాధర్, గుగ్లావత్ రాజునాయక్, జంగిలి శంకర్, నభిఖాన్, తోట సత్యం, సచిన్, కంటం రవి, షౌకత్ పాషా, ఆసీఫ్‌అలీ, మీర్జాబేగ్, ముషీర్, జహీర్, షారు, మైస శ్రీను ఉన్నారు.



సభ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బాలలతో ప్రచారంపై ఫిర్యాదు

నిర్మల్‌ఖిల్లా: పలు రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో భాగంగా విద్యార్థులను, బాలలను వినియోగించుకుంటున్నారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. ఈ మేరకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్‌ని కలిసి రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారంలో భాగంగా పలు ప్రాంతాలలో ఆయా పార్టీల నేతలు బడీడు పిల్లలను, బాలలను ఎన్నికల ప్రచారంలో భాగంగా కండువాలు వేయించి జెండాలను మోసే పనులకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆయా జిల్లాల కలెక్టర్లకు, ఎన్నికల అధికారులకు స్పష్టమైన ఆదేశాలను ఇచ్చిందని వివరించారు.



ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న పరికిపండ్ల

ఫిర్యాదుల స్వీకరణ

ఉట్నూర్‌రూరల్: సాధారణ ఎనికల్లో భాగంగా నియోజకవర్గ ఓటర్ల నుంచి ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు, వినతులు స్వీకరించడానికి నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు గోపాలకృష్ణన్ అందుబాటులో ఉంటారని రిటర్నింగ్ అధికారి జీవాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ గెస్ట్ హౌజ్‌లో ప్రతీరోజు సాయంత్రం 4 నుంచి 5గంటల సమయంలో నియోజకవర్గ ఓటర్లు తమ ఫిర్యాదులను అందజేయవచ్చని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌లో పేకాటాడుతున్న ఏడుగురిని సీసీఎస్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో దాడిచేసి వారి నుంచి రూ.7660 నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చేశారు.

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్ వాగు ఒడ్డున పేకాటాడుతున్న ఆరుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,500 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

బంగారు తెలంగాణలో ఉద్యోగాలు కరువు

లక్ష్మణచాంద: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు కొలువులు కరువై ఉపాధికి దూరమై రోడ్లమీద తిరిగే దుస్థితి దాపురించిందని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ కన్వీనర్ కామిర శ్రీశైలం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లల్లో ఒక్క టీచర్ పోస్ట్ కూడా భర్తీ చేయలేదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం హామీలు ఇవ్వడం తప్ప అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ రాజేందర్, నాయకులు ప్రసాద్, నవీన్, పరమేష్ పాల్గొన్నారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు



సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న యాదవులు

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌లో మంగళవారం సాయంత్రం సదర్ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్‌గల్లి, కోర్వగల్లి, గణేశ్‌నగర్ గల్లికి చెందిన యాదవులు(గొలీలు) తమ దున్నపోతులను అందంగా అలంకరించి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అలాగే దున్నపోతులతో నిర్వహించిన విన్యాసాలను చూపరులను అలరించాయి. సదానంద్ యాదవ్, దార్కేశ్ యాదవ్, దుర్గేశ్ యాదవ్, కరణ్ యాదవ్ పాల్గొన్నారు.

గురువుల్లో గుబులు

- స్పౌజ్ దుర్వినియోగం చేసిన టీచర్లపై చర్యలకు సిద్ధం
- జిల్లాలో ముగ్గురు ఉపాధ్యాయులపై..

ఆదిలాబాద్‌టౌన్: అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయులు కొందరు తప్పిదాలు చేయడంతో విద్యాశాఖ పరువు బజారున పడుతోంది. స్పౌజ్ కేటగిరిలో నిబంధనలు తుంగలో తొక్కారు. స్పౌజ్ ఉపయోగించుకునే ఉపాధ్యాయులు వారి స్పౌజ్ పనిచేసే సమీప పాఠశాలనే ఎంపిక చేసుకోవాలి. కొందరు ఉపాధ్యాయులు ఈ కేటగిరిని దుర్వినియోగం చేసుకోగా, బదిలీలకు సంబంధించిన కమిటీ జిల్లాలో ముగ్గురు ఉపాధ్యాయులు నిబంధనలను ఉల్లంఘించారని తేల్చింది. ఈ విషయాన్ని వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌జేడీ వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విద్యాశాఖ వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

జిల్లాలో త్రిమూర్తులు..

ఆదిలాబాద్ జిల్లాలో ముగ్గురు ఉపాధ్యాయులు స్పౌజ్ కేటగిరిని దుర్వినియోగం చేసినట్లు బదిలీల కమిటీ ఉన్నతాధికారులకు నివేదించింది. కమిటీ సూచన మేరకు వారిపై చర్యలు తీసుకోనున్నారు. తలమడుగు మండలం కజ్జర్లలో పనిచేసే ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు తన భార్య పనిచేసే సమీప పాఠశాల కాకుండా రెండు మూడు పాఠశాలలను వదిలి మరో పాఠశాలను ఎంపిక చేసుకోవడంపై తప్పుబట్టింది. ఇచ్చోడలో పనిచేసే ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఇదే విధంగా వ్యవహరించాడు. తలమడుగు మండలం దేవాపూర్‌లో పనిచేసే బయోసైన్స్ ఉపాధ్యాయురాలు స్పౌజ్‌ను దుర్వినియోగం చేసినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. వీరిపై త్వరలో చర్యలు ఉండబోనున్నాయని సమాచారం. జిల్లా విద్య శాఖాధికారి ప్రణీత స్పౌజ్ దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డికి నివేదిక పంపించగా ఆయన స్పౌజ్‌ను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. అయితే వీరిపై విద్య శాఖాధికారులు చర్యలకు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారి ఆదేశాలు జారీ చేసినప్పటికీ తాత్సారం ఎందుకు చేస్తున్నారో తెలియడం లేదని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. దీంతో స్పౌజ్ దుర్వినియోగం చేసిన గురువుల్లో గుబులు రేపుతోంది. కొందరు ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ నేతల అండదండలతో అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రస్థాయికి క్రీడా పాఠశాల విద్యార్థుల ఎంపిక

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖో..ఖో పోటీలకు ఉట్నూర్‌లోని గిరిజన బాలుర క్రీడ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు గిరిజన జిల్లా క్రీడల అధికారి పార్థసారథి తెలిపారు. మంగళవారం స్థానిక పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి ఖోఖో పోటీలు గత నెలలో జరగగా ఆ పోటీల్లో క్రీడాకారులు నవీన్, నిఖిల్ కుమార్, శంకర్, యాదవ్‌రావు, సురేందర్, ఉదయ్‌కుమార్‌లు పాల్గొని ప్రతిభ చాటారన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ప్రతిభ చాటి పాఠశాల, ఊరు, తల్లిదండ్రుల పేర్లు నిలబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉత్తం, హేమంత్, శేఖర్‌లు ఉన్నారు.



ఎంపికైన విద్యార్థులతో అధికారులు

అనుమతిలేని డీజే సీజ్

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో ముధోల్ కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరావు పటేల్ తరపున సౌండ్ సిస్టంతో ప్రచారం నిర్వహిస్తున్న డీజే వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. డీజేకు అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పాడు.

బాలల దినోత్సవాలేనా..!?

బాలల దినోత్సవం రోజున పిల్లలందరూ తమ ఇంట్లో, పాఠశాలల్లో ఆనందంగా గడుపుతుంటారు. అయితే ఈ దినోత్సవాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహిస్తారు. కొందరు పిల్లలు మాత్రం ఇప్పటికీ బాల కార్మికుల్లాగానే మిగిలిపోతున్నారు. బాలకార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ఆచరణలో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. మంగళవారం ఓ బాలిక ఓ చేతిలో చెత్త, మరో చేతిలో సంచి పట్టుకొని చైన్‌గేట్ సమీపంలో వెళ్తున్న దృశ్యాన్ని సాక్షి క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

